క్లుప్తంగా

పీవీటీజీల గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు



దేగలపాలెంలో ఏర్పాటు చేసిన మీటర్‌ను పరిశీలిస్తున్న ఏఈ నాగేశ్వరరావు

కొయ్యూరు: పీఎం జన్‌మన్‌లో భాగంగా కొమ్మిక పంచాయతీ కర్నికపాలెం, దేగలపాలెంల, రేవళ్లలో ఆదివాసీల గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈ నాగేశ్వరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు. విద్యుత్ మీటర్ల ఏర్పాటును వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఆదివాసీలు ఎవరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. త్వరితగతిన మీటర్ల ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

అరకులోయ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో చీపురుపల్లి వెంకటేష్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చెత్త పేరుకుపోవడంతో శనివారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ పనులను పంచాయతీ ఈవో రాజ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు.

7న మెగా రక్తదాన శిబిరం

హుకుంపేట: కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 7న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో వెంకటరావు శనివారం తెలిపారు. జిల్లాలో పలువురు గర్భిణులు, బాలింతలు, రోగులు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గిరిజన యువతీయువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు. శిబిరానికి కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో హాజరవుతారని తెలిపారు.

ఉచితంగా రక్త పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మారేడుమిల్లి : మండలంలోని ప్రజలకు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వనవాసీ సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్ తెలిపారు. పూజారిపాకలు గ్రామంలో శనివారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

'పల్లెకు పోదాం' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భారతి

కొయ్యూరు: బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బి.భారతి, గిరిజన మోర్చా రాష్ట్ర మేధావుల విభాగం కన్వీనర్ కురుసా పార్వతమ్మ కోరారు. పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం కొయ్యూరులో నిర్వహించిన పల్లెకు పోదాం శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు, ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొండకోనల్లో 'జల్'ధారలు

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో గిరిజనులు బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు పడేవారు... తాగేందుకు కనీసం గుక్కెడు నీళ్లలేక అల్లాడిపోయేవారు. దాహం తీర్చుకునేందుకు కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లి వాగుల్లోని కలుషిత నీటిని ఆశ్రయిస్తూ వ్యాధుల బారిన పడేవారు... ఇదంతా గతం ఇప్పుడు కన్నీళ్ల కష్టాలకు చెక్ పడింది. కొండకోనల్లో 'జల్'ధారలు ప్రవహిస్తున్నాయి. గిరిజనులకు రక్షిత తాగునీరు పుష్కలంగా లభిస్తోంది.



నా పేరు కొత్తూరు కళావతి. మాది జీకే వీధి మండలంలో మారుమూల బత్తునూరు గ్రామం. గతంలో తాగునీటి కోసం మైలు దూరంలోని ఊటగెడ్డకు వెళ్లవలసి వచ్చేది. కలుషిత నీరు కావడంతో గ్రామంలో తరుచూ వ్యాధులు ప్రబలేవి. తప్పనిసరి పరిస్థితుల్లో భయంభయంగా ఆ నీటితోనే దాహం తీర్చుకోవడంతో పాటు వంట చేసేవారం. మారుమూల ప్రాంతమైన మా గ్రామానికి ఇప్పుడు జల్‌జీవన్ పథకం ద్వారా రక్షిత తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో మా నీటి కష్టాలు తీరాయి.

- 200 పైగా గిరిజన గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం
- ఇంటింటికీ కుళాయిలతో రక్షిత నీరు సరఫరా
- తీరిన కన్నీటి కష్టాలు

సీలేరు : గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. జీకే వీధి మండలంలోని పలు గ్రామాల్లో ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. తొలివిడతలో ఇప్పటికే రూ.24 కోట్ల వ్యయంతో 251 గ్రామాల్లో 9,797 కుళాయిలు ఏర్పాటు చేశారు. రెండో విడతలో 65 గ్రామాల్లో రూ.9 కోట్ల వ్యయంతో 3,412 కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొండలను తొలచి పలు గ్రామాలకు పైపులైన్లను వేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 3 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, 200 గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు నిర్మించారు. పుష్కలంగా నీరు సరఫరా అవుతుండడంతో మారుమూల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి తమ కన్నీటి కష్టాలు తీరాయని వారు తెలిపారు.



గాలికొండ పంచాయతీ బత్తునూరులో నిర్మించిన మినీ ట్యాంక్



పైప్‌లైన్లు వేస్తున్న సిబ్బంది



ఓవర్‌హెడ్ ట్యాంక్

మండలం	:	జీకే వీధి
పంచాయతీలు	:	16
గ్రామాలు	:	346
తొలివిడత పనులు జరిగిన గ్రామాలు	:	251
వేసిన కుళాయిలు	:	9,797
ఖర్చు చేసిన నిధులు	:	రూ.24 కోట్లు
రెండవ విడత పనులు జరుగుతున్న గ్రామాలు	:	65
వేయవలసిన కుళాయిలు	:	3,412
మంజూరైన నిధులు	:	రూ.9 కోట్లు
సర్వే జరుగుతున్న గ్రామాలు	:	30

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మారుమూల గాలికొండ పంచాయతీలోగల బత్తూరులో ఏడాది కిందటే జల్‌జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. - పలాస నూకాలమ్మ, బత్తునూరు

జోరుగా పనులు



మండలంలో చాలా గ్రామాల్లో కుళాయిల ఏర్పాటు పూర్తయింది. మరో 65 గ్రామాల్లో ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.గిరిజనులకు ఈ వేసవిలో మంచి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- భగత్ రాం, ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అనంతగిరి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య

రాజవొమ్మంగి : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ వెంకయ్యలు శనివారం పరిశీలించారు. రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలోని అనంతగిరి, లాగరాయి, కింద్ర, తాళ్ళపాలెం, మర్రిపాలెం, బడదనాంపల్లి తదితర పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రాల భౌగోళిక అంశాలతో పాటు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ప్రహరీ, ప్రత్యేక అవసరాలు గల వారు ఓటు వేసేందుకు వెళ్లే ర్యాంపు తదితర విషయాలపై నివేదిక రూపొందించారు పోలింగ్ కేంద్రం సెల్ సిగ్నల్ పరిధిలో ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాలపై ఆరా తీశారు. నివేదికను తమ శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని సీఐ సన్యాసినాయుడు తెలిపారు.

సింహాచలానికి డాక్టరేట్



పాడేరుకు చెందిన కుర్రబోయిన సింహాచలానికి సౌత్ కొరియాకు చెందిన నేషన్ భూషణ్ యూనివర్సిటీ ఫర్ ఫారిన్ స్టడీస్ నిర్వాహకులు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. - పాడేరు

వేతనదారుల సంఖ్య పెంపునకు కృషి

రాజవొమ్మంగి: ఉపాధి పనులకు వచ్చే వారి సంఖ్య మరింత పెరగాలని రాజవొమ్మంగి ఉపాధిహామీ కార్యాలయం ఏపీవో సురేష్ కుమార్ అన్నారు. ఈమేరకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. వంచంగి పంచాయతీ జి.కొత్తపల్లిలో ఉపాధివేతనదారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వేతనదారులకు రూ.50లక్షల మేర వేతనాలు విడుదలైనట్టు ఆయన చెప్పారు. మండలంలో లక్ష్యం మేరకు ఉపాధి పనులు పూర్తయినట్టు చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి చెంది 5.37 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా లక్ష్యాన్ని మించి ఇప్పటికే 5.45 లక్షల పనిదినాలు పూర్తయినట్టు తెలిపారు.

సీఎం జగన్‌తోనే గిరిజన ప్రాంత అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం



పెదబయలులో మాట్లాడుతున్న అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం



మత్స్యలింగంను సన్మానిస్తున్న నాయకులు

పెదబయలు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాతే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల ప్రజలకు, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్ సీపీ అరకు నియోజకవర్గం సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. పెదబయలు మండలంలోని పార్టీ ముఖ్య నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరకు నియోజకవర్గంలో అధిక మెజారిటీతో పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ జర్సింగి గంగాభవాని, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్ల సన్యాసి, సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు,మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, మండల నాయకులు కనకరాజు, అనంతరావు, గంపరాయి అజయ్‌కుమార్, లంకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

దుంబ్రిగుడ: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ అరకు నియోజక వర్గ సమన్వయ కర్త రేగం మత్స్యలింగ అన్నారు. శనివారం దుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ గేదలబంద, గుంటసెల పంచాయతీ పిత్తగుడ,కొరంజిగుడ గ్రామాల్లో ప్రజలకు శనివారం సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరుశురాం, త్రినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ అరకులోయ అసెంబ్లీ సమన్వయ కర్త రేగం మత్స్యలింగం కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధిష్టానం తనను సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అరకులోయలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం సాధించేందుకు నాయకులు కృషి చేయాలన్నారు.

మత్స్యలింగంకు సన్మానం

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా నియమితులైన జెడ్పీటీసీ రేగం మత్స్యలింగంను హుకుంపేట మండల నాయకులు శనివారం ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, మార్కెట్ యార్డ్ వైఎస్ చైర్మన్ కొండలరావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి భూషన్, నాయకులు సదాశివరాజు, వెంకట్, జన్ని సింహాచలం, మహేష్, వెంకటరావు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న పరిశ్రమలో ప్రమాదం .. ముగ్గురికి గాయాలు

యలమంచిలి రూరల్: బయ్యవరం పంచాయతీ పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్న వైశాఖీ బయో మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. 20 అడుగులకు పైగా ఎత్తులో ఉన్న భారీ షెడ్డుకు అమర్చుతున్న ఇనుప రాడ్లు ఊడిపోవడంతో అక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు కింద పడిపోయారు. సేఫ్టీ బెల్టులుండటంతో వారికి ప్రాణాపాయం తప్పిందని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ శనివారం రాత్రి చెప్పారు. గాయపడిన ముగ్గురికీ అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వీరిలో ఒక కార్మికుడికి ఇంకా చికిత్స కొనసాగుతోందని సీఐ తెలిపారు. గురువారం జరిగిన ఈ ప్రమాదం విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. గాయపడిన కార్మికులు రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారని తెలిసింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటును తమ గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తున్నా సాగునీటి కాలువలు కప్పి పరిశ్రమ నిర్మాణ పనులు చేపడుతున్నారని వైస్ ఎంపీపీ రాజాన శేషగిరిరావు(శేషు) శనివారం రాత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యంపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

గ్యారెంటీల పేరిట మళ్లీ బూటకపు హామీలు

వైఎస్సార్ సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

కొయ్యూరు: బాబు గ్యారెంటీల పేరిట ఆరు బూటకపు హామీలతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సిద్ధపడుతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎం.విశ్వేశ్వరరాజు తెలిపారు. అంతాడ, బంగారంపేట, చింతలపూడి పంచాయతీల్లో శనివారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఆరు అబద్ధాలతో వస్తున్న బాబును నమ్మవద్దని ప్రజలను కోరారు. ఒంటరిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేక చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ జె.రాజులమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్. సూరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్‌లు సుర్ల చంద్రరావు,సెగ్గే రమాదేవి, పొట్టిక భవాని, కె.పెంటమ్మ, ఆర్.నూకాలమ్మ, పొట్టికశ్రీను, రాజు బాబు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, అచ్చిరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారికి సత్కారం

రాజవొమ్మంగి: బదిలీపై వెళుతున్న స్థానిక తహసీల్దార్ వై.వి. సుబ్రహ్మణ్యాచారి దంపతులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాదాపు ఐదు సంవత్సరాలు ఇక్కడ విధులు నిర్వహించిన సుబ్రహ్మణ్యాచారి అంకితభావంతో పనిచేశారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎ. సత్యనారాయణ, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మలకు అండగా వైఎస్సార్‌సీపీ



డ్వాక్రా సభ్యులు చెక్కు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. చింతపల్లిలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రూ.34 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో నాల్గవ విడతగా మండలంలోని అక్క చెల్లెమ్మల ఖాతాల్లో రూ.90.15 లక్షలు జమ చేసినట్టు ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం డ్వాక్రా సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వెలుగు పీడీ వి.మురళి, సర్పంచ్ దురియా పుష్పలత, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కన్వీనర్ గణబాబు,స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ,వెలుగు ఏపీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను హత్యచేసిన నిందితులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

గంగవరం: విశాఖ రూరల్ తహసిల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్యను దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం రంపచోడవరం డివిజన్ కార్యదర్శి ఫయాజ్ బాష డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసిల్దార్ వీరభద్రరావు, మండల సర్వేయర్ దొర పాల్గొన్నారు.

స్కూటీ అదుపు తప్పి మహిళ దుర్మరణం



ఘాట్ రోడ్డుపై గంగయ్యమ్మ మృతదేహం

నాతవరం : ఘాట్‌రోడ్డులో స్కూటీ అదుపు తప్పిన ఘటనలో గిరిజన మహిళ మరణించింది. కొయ్యూరు మండలం ఆడాకులు పంచాయతీ శివారు కృష్ణారం గ్రామానికి చెందిన కె.గంగయ్యమ్మ(42) శనివారం ఉదయం నాతవరం మండలం సుందరకోట పంచాయతీ శివారు జంపావారిపాకలు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైంది. మధ్యాహ్నం భోజనం అనంతరం స్కూటీపై తిరిగి ఇంటికి వెళుతుండగా సుందరకోట సమీపంలో ఘాట్‌రోడ్డుపై స్కూటీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న మదుమును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగయ్యమ్మకు తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు గమనించి, 108కు సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చి సిబ్బంది పరీక్షగా అప్పటికే మృతిచెందింది. గంగయ్యమ్మకు ఇద్దరు ఆడ పిల్లలు, భర్త ఉన్నారు. గత ఏడాది పెద్దమ్మాయికి వివాహం చేయగా చిన్నమ్మాయి చదువుకుంటుంది. భర్త కూలి పని కోసం తూర్పుగోదావరి జిల్లాలో ఉంటున్నాడు. అప్పటి వరకు కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపిన గంగయ్యమ్మ రోడ్డు ప్రమాదంలో మరణించిన వార్త విన్న బంధువులంతా షాక్‌కు గురయ్యారు. గంగాయమ్మ అత్తారి గ్రామం సుందరకోట, పుట్టింటి గ్రామం కృష్ణారంలో విషాదం నెలకొంది. నాతవరం పోలీసులు సంఘటన స్థలంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తామని నాతవరం ఎస్ఐ రామారావు తెలిపారు.

పీహెచ్‌సీల నిధులు సక్రమంగా వినియోగించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: ప్రాథమిక ఆరోగ కేంద్రాల నిర్వహణ నిధులు సక్రమంగా వినియోగించాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మాడగడ, గన్నెల, సుంకరమెట్ట పీహెచ్‌సీల వైద్యాధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఉన్న సర్పంచ్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించిన అనంతరం ఆస్పత్రులకు కావలసిన సామగ్రిని కొనుగోలు చేయాలన్నారు. ఆస్పత్రుల నిర్వహణ నిధులతో కొనుగోలు చేసిన సామగ్రి, చేపట్టిన పనుల వివరాలు అందజేయాలని ఆదేశించారు. నిధుల వినియోగంపై సభ్యులైన సర్పంచ్‌లు, అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన తనకు సరైన వివరాలు ఇవ్వకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తీరు మారకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేష్, సర్పంచ్‌లు సుస్మిత, జ్యోతి, బొజ్జ, చిన్నబాబు,వైద్యాధికారులు కమలకుమారి, ఉదయ్‌ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ పనులు ప్రారంభం



జల్‌జీవన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌ఎంపీపీ భాగ్యవతి,సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను శనివారం వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఫిర్యాదు



ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కుంజా శ్రీను

చింతూరు: ఆదివాసీలను మోసంచేసి సొమ్ములు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను కోరారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏఎస్పీ రాహుల్‌మీనాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట, మేడువాయి గ్రామాల్లో ఆదివాసీలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. పట్టా భూమి కావడంతో అధికారులు గుడిసెలను తొలగించారని ఆయన తెలిపారు. భూములు, పట్టాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది వ్యక్తులు ఆదివాసీల నుంచి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారని ఆయన పేర్కొన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని వారి నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేయాలని ఆయన కోరారు.